మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం
21 ఆగస్టు 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీతో, పారదర్శకంగా పూర్తి చేయాలి.





**- ఎస్ఐఆర్ లో భాగంగా నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలన వరకు పక్కాగా చర్యలు చేపట్టాలి.**

**- ఎస్ఐఆర్ లో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్ల నోటీసులు జారీ, ధృవీకరణ ప్రతాలు పరిశీలన ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**

**ఖమ్మం, ఆగస్టు- 20,మీ వార్త ప్రతినిధి.**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్లో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్ల పరిష్కార ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నోటీసుల జారీకి సంబంధించిన రికార్డులను, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధృవపత్రాలను పరిశీలించి, ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్లో ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, ఓటరు వివరాల్లో వ్యత్యాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం నో మ్యాపింగ్, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువు సమయంలో హాజరై తమ పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధృవపత్రాలను నిబంధనల మేరకు పరిగణనలోకి తీసుకుని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు, అక్టోబర్ 15 వరకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ అన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన ధృవపత్రాలతో నిర్ణీత తేదీ, సమయంలో హాజరయ్యేలా బీఎల్ఓలు, సంబంధిత అధికారులు ముందస్తుగా సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయాన్ని అందించాలని తెలిపారు.గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ధ్రువపత్రాల స్వీకరణకు తేదీ, సమయాలను ముందుగానే ఖరారు చేసి, ఓటర్లకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్లో గుర్తించిన అనామలీస్ కేసులు, మ్యాపింగ్ కాని కేసులకు సంబంధించి బీఎల్ఓల ద్వారా నోటీసు ప్రతిని తప్పనిసరిగా అందజేయాలని చెప్పారు. నోటీసు అందుకున్న ఓటరు నుంచి స్వీకరణ ధ్రువీకరణ తీసుకుని, సంబంధిత రికార్డుల్లో భద్రపరచాలని ఆదేశించారు.నోటీసుల జారీ, ధ్రువపత్రాల స్వీకరణ, పరిశీలన, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం తదితర ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహాయాన్ని అందిస్తూ, ప్రతి కేసును నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ అన్సారి, వి.వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, బీఎల్ఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో ఆకస్మిక తనిఖీ

### - జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి

**సత్తుపల్లి ఆగస్టు 20 మీ వార్త ఆర్ సి**



పట్టణంలోని గుడిపాడు రోడ్డులో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలను గురువారం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎండి. ముజాహిద్ ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాల రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అంతరం విద్యార్థుల తరగతి గదులు, నిద్రించేగదులు, మరుగు దొడ్లు, వంటశాల, తాగునీటి ప్లాంట్, కళాశాల ఆవరణను పరిశీలించి, ప్రతీ రోజూ మెనూ ప్రకారం సక్రమంగా పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా విద్యార్థులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు నివేదిక ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య ను కోరారు

## పాము కాటుకి గురవుతున్న దుమ్ముగూడెం మండల ప్రజలు..

**- దుమ్ముగూడెం మండలంలో పాముకాటు గురవుతున్న వ్యవసాయ రైతులు కూలీలు ...**

**- మండలంలో పెరిగిపోతున్న పాము కాటు కేసులు, వ్యవసాయ రైతులు,కూలీలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలంటున్నా వైద్యులు..**


**దుమ్ముగూడెం ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం, నందుల చలక గ్రామానికి చెందిన సోడి సుబ్బమ్మ వయసు 49 , ఈమె వ్యవసాయ పనుల నిమిత్తం, పొలం గట్లకు నీరు ఆ పుటకొరకు అడ్డు కట్టలు వేసేందుకు ఈరోజు ఉదయం పొలం దగ్గరకు వెళ్లిన ఈమెకు కుడి కాలికి గుర్తు తెలియని పాము కాటు వేయడంతో, వెంటనే కుటుంబ సభ్యులు నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు, పరిశీలించిన అక్కడి వైద్యురాలు డాక్టర్ పావని రెడ్డి వెంటనే ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తరలించారు.....

## నారాయణ పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు.

**ఖమ్మం, ఆగస్టు 20,మీ వార్త ప్రతినిధి.**



ఖమ్మం నారాయణ పాఠశాలలో తెలంగాణ,సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని బోనాల పండుగ విశిష్టతను తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలనునిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకలకు పోతురాజు వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.తెలంగాణ,జానపద, సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జి .నవీన్ కుమార్ విద్యార్థులకు బోనాల పండుగ ప్రాముఖ్యతను వివరించి, మన సంస్కృతి మరియు సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో బోనాల వేడుకలు ఎంతో వైభవంగా, ఆనందోత్సాహాలతో జరిగాయి.

## రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనవి మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల





**నేలకొండపల్లి ఆగస్టు 20 మీ వార్త ఆర్ సి**

నేలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో గురువారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...దేశ ఆర్థిక మరియు సాంకేతిక వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. దేశ ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఆయన లేని లోటు దేశానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు రాయపూడి నవీన్, యం.వెంకన్న, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, కుక్కల ఆదాం పొన్నగాని రాంభాస్కర్, కోడిరెక్క వినోద్, లక్కం ఏడుకొండలు, అనంతు సత్యనారాయణ, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, కడియాల నరేష్, సీ. హెచ్. వెంకటేష్, రంగయ్య, కాశిబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ నుంచి పింఛన్ల దరఖాస్తులు వచ్చిన సత్వరమే ఆన్లైన్ లో నమోదు చేయండి ఎంపీడీవో ఎర్రయ్య

**- పంచాయతీ కార్యదర్శులతో ఛాంబర్ లో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన ఎంపీడీవో**

**నేలకొండపల్లి ఆగస్టు20 మీ వార్త ఆర్ సి**



నేలకొండపల్లి మండలం గురువారం ఫింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు.వివిధ పంచాయతీల నుంచి వచ్చిన దరఖాస్తుల పై పంచాయతీ కార్యదర్శుల తో చాంబర్లో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. నేలకొండపల్లి మండలం లోని ఆయా గ్రామాల నుంచి వచ్చే. ప్రతీ దరఖాస్తు ను వెంటనే ఆన్లైన్ చేయించాలని సూచించారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించాలని ఆదే శించారు.ఫింఛన్ ల కోసం దరఖాస్తు లు చేసుకోవాలని ప్రజలకు వివరించాలని సూచించారు.ఆన్లైన్ నమోదు లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.ఈ నెల చివర వరకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను అప్రమతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: టీజీజేఏసీ..

**కూసుమంచి ఆగస్టు 20 మీ వార్త ఆర్ సి**



కూసుమంచి,మండల పరిధిలో ఉద్యోగుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీజేఏసీ కూసుమంచి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నాయకన్ గూడెం కాంప్లెక్స్ సమావేశంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీజేఏసీ నాయకులు శీలం ఆంజనేయులు, మండవ నరసయ్య, బెల్లంకొండ నరసింహారావు, కృష్ణవేణి, నాగలక్ష్మి తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

2వ పి, ఆర్, సి,ని వెంటనే అమలు చేయాలి.
6 పెండింగ్ డి,ఎ,లను వెంటనే విడుదల చేయాలి.
సీపీస్ ను రద్దు చేసి ఓ,పి,ఎస్, ను పునరుద్ధరించాలి.
జీవో -25ను సవరించి ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి. న్యూస్ ఈ,హెచ్,ఎస్ సక్రమంగా అమలు చేయాలి. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలి. అలాగే ఆగస్టు 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని, అలాగే సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఘనంగా వీరన్న జన్మదిన వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే**



**కారేపల్లి: ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి**



మండల పరిధిలోని భిక్య తండా గ్రామానికి చెందిన గిరిజన యువ నాయకుడు, మండల సుపరిచితుడు, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ శాలువా కప్పి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కారేపల్లి లో మంగళం కంపెనీ డైరెక్టర్ రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండల ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు శు భాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, సర్పంచ్ లు బానోత్ రాందాస్, బానోత్ హీరలాల్, భూక్య లక్ష్మణ్, నాయకులు హన్మకొండ రమేష్, జవ్వాజి శ్రీను, పిల్లి వెంకటేశ్వర్లు, భూక్య రాంకిషోర్ నాయక్, గుగులోత్ హారు, బానోత్ కోటి, నాగేంద్ర, హరి, కుమార్, జూలూరుపాడ్ నాయకులు బాధవత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## లకావత్ శ్రీను అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఉపాధ్యాయుడు కిషన్

కామేపల్లి, ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి:





కామేపల్లి మండలం టేకుల తండా లో అనారోగ్య కారణాలతో మృతిచెందిన లకావత్ శ్రీను (32) అంత్యక్రియల నిమిత్తం స్థానిక ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ రూ.5000 ను ఆర్థిక సహాయంగా వారి కు టుంబ సభ్యులకు గురువారం అందజేశారు.సర్పంచ్ జరపలా రెడ్డి,ఉపసర్పంచ్ నందా,మాజీ సర్పంచ్ మాన్సింగ్,రాంబాబు చిన్న,సర్మన్,నరేష్ ల చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశా రు.శ్రీను మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కు టుంబానికి ఉపాధ్యాయుడి కిషన్ తో పాటు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు,మాజీ ప్రజా ప్రతినిధులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పే ర్కొన్నారు.శ్రీను మృతి తీరని లోటు అని అన్నా రు.శ్రీను మృతితో నాటి రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా కారుడిని కోల్పోయామని అన్నారు.

## లిమాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతివేడుకలు

దమ్మపేట ఆగస్టు 20 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు :



భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్ ఆధ్వర్యంలో దమ్మపేట ప్రధాన సెంటర్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహాన్నికి పూలమాలలు వేసి కాంగ్రెస్ శ్రేణులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ భారతదేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల్లో విప్లవం తెచ్చి, ఓటింగ్ వయస్సును 18 సం .లకు తగ్గించి, పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, 1986 నూతన విద్యా విధానం ద్వారా నవోదయ విద్యాలయాలను ప్రారంభించి గ్రామీణ విద్య ఆరంభించారు అని, యువతకు అవకాశాలు కల్పించడంలో, విద్య, సాంకేతిక రంగాల అభివృద్ధికి ప్రోత్సాహం అందించి ఆధునిక భారత నిర్మాణానికి కృషి చేశారని, స్థానిక సంస్థల్లో యువతకు, మహిళలకు పోటీ చేసే ప్రాధాన్యత ఇచ్చారని, దేశ ఐక్యతకు, సమగ్ర అభివృద్ధి కోసం చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే రాజీవ్ గాంధీ కలలను సాకారం చేయడం మనందరి బాధ్యత పై ఉంది అన్నారు. నివాళులు అర్పించిన వారిలో కందుల వెంకటేశ్వరరావు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, చిన్నశెట్టి గోపి, తాళ్ళ శంకర్, పిట్టల శ్రీనివాసరావు, అన్నవరపు నాగేంద్రరావు, జెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ కొమరం అర్జున్ రావును పరామర్శించిన ఎమ్మెల్యే జారే

పార్కలగండి ఆగస్టు 20 మీ వార్తా ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:



దమ్మపేట మండలం పార్కలగండి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ కొమరం అర్జున్ రావు లి ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. పలు జాగ్రత్తలు తెలిపి, పార్టీ పరంగా ఎల్లవేళలా అండగా ఉంటామని ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు... ఈ కార్యక్రమంలో స్థానిక మాజి సర్పంచ్ కోర్స సాగర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు శివాజీ, నాగేంద్ర ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## తెలంగాణలో నిరుద్యోగులకు ఊరట వయోపరిమితి రెండేళ్లు పెంపు!

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో యూనిఫామ్ ధరించి సమాజానికి సేవ చేయాలనే లక్షల మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయంతో భారీ ఊరటనిచ్చింది. గత కొంతకాలంగా నోటిఫికేషన్ల ఆలస్యం, కరోనా తదనంతర పరిణామాల వల్ల వయసు మించిపోయి ఆందోళన చెందుతున్న అభ్యర్థుల విన్నపాలను ప్రభుత్వం సానుకూలంగా మన్నించింది. ఈ క్రమంలోనే వివిధ యూనిఫామ్ సర్వీసెస్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని అదనంగా మరో రెండేళు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో నెంబర్ 122 ప్రకారం రాష్ట్రంలోని ఏడు ప్రధాన యూనిఫామ్ శాఖల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు లభించనుంది. ఇప్పటికే మే 18, 2026 నుంచి ప్రభుత్వం ఐదేళ్ల వయోపరిమితి పెంపును అమలు చేస్తోంది. ఇప్పుడు దానికి అదనంగా మరో రెండేళ్లు జోడించడంతో అభ్యర్థులకు లభించే మొత్తం వయోసడలింపు ఏకంగా 7ఏళ్లు చేరింది. దీని వల్ల వయసు పైబడి పోటీకి దూరమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ ప్రాణం పోసినట్టు అయ్యింది.ఈ వయోపరిమితి పెంపు వర్తించే ప్రధాన శాఖలు ఏంటంటే... తెలంగాణ పోలీస్ శాఖ అయిన సివిల్ ఎస్ఐ కానిస్టేబుల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ , కమ్యూనికేషన్స్ పోస్టులకు వర్తిస్తుంది. అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ పోస్టులకు ఇది అమలు అవుతుంది. జైళ్ల శాఖ డిప్యూటీ జైలర్, వార్డర్ పోస్టుల్లో వర్తింపజేస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, అటవీ శాఖలోని ఉద్యోగాలకు కూడా వర్తింపజేస్తారు.

**ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?**

ఈ వయోపరిమితి పెంపు నిర్ణయం కేవలం భవిష్యత్‌లో వచ్చే నోటిఫికేషన్లకే పరిమితం కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియకు కూడా ఈ ఏడేళ్ల సడలింపు వర్తిస్తుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఇప్పటికే అప్లై చేయలేకపోయిన అభ్యర్థులకు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి అవకాశం కల్పించే అవకాశం ఉంది.

# ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు భయపడాల్సిన అవసరం లేదు

మ్మం, ఆగస్టు 20,మీ వార్త ప్రతినిధి.



ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని యశోద ఆసుపత్రి సోమాజిగూడ శాఖకు చెందిన థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ థొరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స కాదని,గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కార్డియో థొరాసిక్ సర్జరీగా పిలుస్తారని తెలిపారు. ఊపిరితిత్తులు,ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా థొరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు.ముఖ్యంగా కొవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.యశోద ఆసుపత్రి సోమాజిగూడలో పల్మనాలజీ,థొరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలూ అందిస్తున్నామని చెప్పారు.అదేవిధంగా ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) సేవలను కూడా ప్రారంభించామని,ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి పలువురు రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు.ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజెస్,ధూమపానం కారణంగా వచ్చే సీఓపీడీ వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు.అలాంటి రోగులు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆయాసంతో జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటారని, వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.క్షయ వ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో కొంత భాగం దెబ్బతినడం,దగ్గులో రక్తం పడటం,ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు కూడా శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. మినిమల్ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతోనే ఊపిరితిత్తుల్లోని వ్యాధిగ్రస్త భాగాన్ని తొలగించే అవకాశంఉందన్నారు.సాధారణంగా ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల పరిమాణంలో చిన్న కోతలతో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనికి మరింత ఆధునిక రూపంగా రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అందుబాటులోకివచ్చిందని,యశోద ఆసుపత్రిలో ఈ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు.గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స అంటే చాలా ప్రమాదకరమని భావించి రోగులు భయపడేవారని, ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించగలుగుతున్నామని డాక్టర్ రోహన్ రెడ్డి పేర్కొన్నారు.సూర్యాపేట,ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉంటే భయపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు.కుటుంబసభ్యులు,బంధువులు, స్నేహితుల్లో ఎవరికైనా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఉంటే ఈ సమాచారాన్ని వారికి చేరవేయాలని మీడియా ప్రతినిధులను కోరారు.

ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ఇకపై భయపడాల్సినంత ప్రమాదకరమైనవి కావు, ఆధునిక మినిమల్ ఇన్వేసివ్,రోబోటిక్ థొరాసిక్ సర్జరీలతో సురక్షితంగా చికిత్స అందించవచ్చు. అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా సాధ్యమే. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ శ్రీధర్,అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు .

# ఖానాపురం పండ్ల మార్కెట్ యార్డుకు రూ.17.72 కోట్లు నిధులు మంజూరు.

- ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన యూనియన్ నాయకులు.
- మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం.

ఖమ్మం, ఆగస్టు 20,మీ వార్త ప్రతినిధి.





ఖానాపురం ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పండ్ల వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపురం హవేలీలోని మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హనుమంత రావు, కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అశ్రీఫ్ మాట్లాడుతూ మంత్రి ప్రత్యేక చొరవతో నిలిచిపోయిన మార్కెట్ యార్డు పనులు తిరిగి ఊపందుకున్నాయని తెలిపారు. అనంతరం ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.గతంలో మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో పండ్ల వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానిమియా, కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు గరగ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత నిధులతో మార్కెట్ యార్డులో మొత్తం 31 అభివృద్ధి పనులు చేపట్టనున్నారని, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ట్రేడర్స్ షాపులు, కవర్ షెడ్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ బ్రిడ్జి, రైతుల విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు తదితర మౌలిక వసతులు కల్పించనున్నారని వివరించారు.మార్కెట్ యార్డు ప్రాంగణంలో సీసీ ఫ్లోరింగ్, అంతర్గత రహదారుల అభివృద్ధి, కాంపౌండ్ వాల్, టవర్ లైట్లు, విద్యుదీకరణ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కెట్ పూర్తయితే రోడ్లపై పండ్ల విక్రయాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వ్యాపారులు, రైతులు, వినియోగదారులకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మార్కెట్ అభివృద్ధితో పండ్ల వ్యాపార కార్యకలాపాలు మరింత క్రమబద్ధంగా సాగుతాయని అన్నారు. మధ్యలో నిలిచిపోయిన మార్కెట్ యార్డు నిర్మాణాన్ని పూర్తి చేసి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయన తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్, కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అశ్రీఫ్ చేసిన కృషికి అసోసియేషన్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, కోశాధికారి ఉస్మాన్, గౌరవ సలహాదారులు అన్నపు మల్లికార్జున్, ఖాసీం, కరీం తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జయంతి నిర్వహించిన కాంగ్రెస్ నేతలు

### కంప్యూటర్ రంగంలో వినూతన మార్పులు తెచ్చిన రాజీవ్ గాంధీ





కారేపల్లి ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి

కంప్యూటర్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి నేడు దేశానికి దిక్సూచి అయిన రాజీవ్ గాంధీ ప్రజల మదిలో స్థిర స్థానాన్ని పొందారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు కాంగ్రెస్ నేతలు అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి లో గురువారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు రాజీవ్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతల కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూస్థానిక ప్రభుత్వాలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకుకృషిచేసిన వ్యక్తి అని కొనియాడారు.రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకురాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన అసలు సిసలైన గాంధీయవాది రాజీవ్ గాంధీ అని, దేశంలో ఎలక్ట్రానిక్, సమాచార విప్లవానికి ఆయనే శ్రీకారం చుట్టారు అన్నారు. నేడు ప్రతి ఇంట్లో టీవీ, ప్రతి ఒక్కరి చేతిలో సెల్ ఫోను ఉన్నాయంటే దీనికి కారకుడు రాజీవ్ గాంధీయేనని తెలిపారు. ఆయన జీవించింది కేవలం 47 సంవత్సరాలే అయినా ఎన్నాళ్లు జీవించామని కాదు... జీవించిన కాలంలో ఏమి చేశాము అన్నది ముఖ్యమన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సర్పంచ్ వీర ప్రతాప్ టోనీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు అడ్డగోడ ఐలయ్య వాణిజ్య విభాగం నాయకులు సురేందర్ మణి యార్ భాగ్యనగర్ తండా గ్రామ సర్పంచ్ హీరాలాల్ యువజన నాయకులు వినోద్ కారేపల్లి టౌన్ అధ్యక్షుడు పోలగాని శ్రీనివాసరావు యాకూబ్ దేగల ఉపేందర్ తాజుద్దీన్ గుగులోత్ భీముడు ఆదేర్ల రాములు సక్రు నాయక్ ఎండి అనీఫ్ తాజుద్దీన్ షరీఫ్ సంగు నాగయ్య ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు

## రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీనా.. కాంగ్రెస్ పై తిరుగుబాటా

**నల్గొండ :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు మరోసారి పెద్ద దుమారాన్నే రేపాయి. బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైంది , రాజకీయాలను మార్చే శక్తి నాకుంది అంటూ ఆయన చేసిన కామెంట్లు, కొత్త పార్టీ పెడతారా లేక స్వపక్షంపైనే తిరుగుబాటా అనే ఉత్కంఠను రేకెత్తించాయి. కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కీలక పదవులు కట్టబెడుతున్నారని రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా సీమాంధ్ర కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో ప్రభుత్వం నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించడం నేరుగా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రశ్నించడమే. కేబినెట్ విస్తరణ ఆలస్యం కావడం, తన కీలక అనుచరులకు ప్రాధాన్యత దక్కకపోవడం పట్ల ఆయనలో గూడుకట్టుకున్న తీవ్ర అసంతృప్తికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి.రాజగోపాల్ రెడ్డి సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని గమనిస్తే, ఆయన ప్రెజర్ పాలిటిక్స్ చేయడంలో దిట్ట. గతంలో మునుగోడు ఉపఎన్నిక సమయంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడం, ఆ తర్వాత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మళ్లీ కాంగ్రెస్ గూటికి రావడం ఆయన రాజకీయ వ్యూహాల్లో భాగమే. ప్రభుత్వం ఏర్పాటై ఇంతకాలమవుతున్నా తనను మంత్రివర్గంలోకి తీసుకోకపోవడంతో, అధిష్ఠానంపై ఒత్తిడి పెంచి రాబోయే కేబినెట్ విస్తరణలో బెర్త్ ఖరారు చేసుకోవడానికే ఇటువంటి తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారనే ప్రచారం బలంగా ఉంది.తమిళనాడు తరహా రాజకీయ మార్పు తెస్తా, కొత్త రాజకీయ శక్తులను ప్రోత్సహిస్తా అని ఆయన అనడం కొత్త పార్టీ వైపు సంకేతాలు ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కొత్త పార్టీ పెట్టడం అంత సులభం కాదు. బయటకు వస్తే ఎమ్మెల్యే సభ్యత్వం రద్దవుతుంది. రాజగోపాల్ రెడ్డికి నల్గొండ జిల్లాల్లో పట్టు ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా సొంతంగా ఒక పార్టీని నడిపించే వ్యూహాత్మక నిర్మాణం, పార్టీ క్యాడర్ బలం తక్కువ. అందువల్ల కొత్త పార్టీ అనేది ఒక హెచ్చరిక మాత్రమేనని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.

# జేఏసీ ఆటో క్యాబ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీవోకు సమ్మె నోటీస్.

**ఖమ్మం, ఆగస్టు 20, మీ వార్త ప్రతినిధి.**

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23 అర్ధరాత్రి 12 గంటల నుండి జేఏసీ ఆధ్వర్యంలో జరగబోయే ఆటో క్యాబ్ డ్రైవర్స్ రాష్ట్ర వ్యాప్త సమ్మె నోటీస్ ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి జేఎల్ శ్రీనివాస్ రావు కి అందించిన జేఏసీ యూనియన్ నాయకులు ఈ కార్యక్రమంలో ఆర్టిఏ డైరెక్టర్ వెంకన్న పాల్గొన్నారు. ఆటో క్యాబ్ డ్రైవర్ల డిమాండ్స్ మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి, ఓలా, ఉబర్,రాపిడో లాంటి సంస్థల వలన ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని కావున రాష్ట్ర ప్రభుత్వమే టీజీ యాప్ తీసుకువచ్చి ఆటో క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని చట్ట విరుద్ధంగా వైట్ ప్లేట్లతో నడుపుతున్న టూవీలర్లను నిషేధించాలి,ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలి,త్రీ వీలర్ లైసెన్సులను ఎల్ ఎం వీ గా మార్చే సందర్భంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని,ఆర్టీసీకి ఈవి ఆటోలు అనుసంధానం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించాలి,అర్హులైన ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు,ఇళ్ల స్థలాలు



ఇవ్వాలని కోరారు. యూనియన్ జేఏసీ నాయకులు ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి మోటారంగం జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ, సీఐటీయూ మోటార్రంగం జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్,
ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు రావుల శ్రీనివాసరావు,బి ఆర్ టి యు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె సత్తార్,టి ఎన్ టి యు సి నాయకులు గండమల్ల సుధాకర్,తెలంగాణ క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు రాంబాబు, అజీజ్



ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మోహన్ రావు,సీఐటీయూ నగర ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాములు, ఐ ఎన్ టి యు సి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, నగర అధ్యక్షుడు తోట సైదులు,పార్లమెంట్ అధ్యక్షుడు ఉమా రావు, మోటారురంగం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె జానీ మియా,నగర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర కోశాధికారి ముల్లర్, నగర కార్యదర్శి ఎస్.కె సలీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పొలంలో పంట కుంట

- ప్రతి ఊరి లో నీటి కుంట
- ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం
- భూగర్భ జలాల పెంపుదలే లక్ష్యం
- డి ఆర్ డి ఏ పి డి కొండపల్లి శ్రీరామ్

**కామేపల్లి, ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి :**






ప్రతి పొలంలో పంట కుంట, ప్రతి ఊరిలో నీటి కుంట, ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలని డి ఆర్ డి ఏ పి డి కొండపల్లి శ్రీరామ్ కోరారు.కామేపల్లి మండల పరిధిలోని కామేపల్లి, ఊట్కూర్, పొన్నెకల్, రుక్కి తండా తదితర గ్రామాల్లో పంట కుంట పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతుల పంట పొలాల్లో భూగర్భ జలాలను పెంచేందుకు పంట కుంటలను విబిజీ రామ్ జీ ద్వారా నిర్మిస్తున్నట్టు తెలిపారు.రైతులు పంట కుంటలను నిర్మించి భూగర్భ జలాల పెంపుదలకు తోడ్పడాలని కోరారు.నిర్దేశించిన లక్ష్యసాధనకు స్థానిక

ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధరావత్ సోంలాల్, ఎం పి ఓ వివిఎస్ శాస్త్రి, ఏపీడి, ఏపీవో అద్దంకి శ్రీరాణి, సర్పంచ్ లు రమాదేవి, హనుమంతరావు, అజ్మీర బుల్లి, భూమిక, బానోత్ కమలా దేవయ్య, పంచాయతీ కార్యదర్శులు
ప్రవీణ్, వసంత, ఎండి ఫజల్, ఈసీ దామాల వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్ లు సుప్రియ,బావ్



సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, సీనియర్ మెట్లు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# చదువు ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపుదల






- హక్కుల పై అవగాహన అలవర్చుకోవాలి
- స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలి
- జిల్లా వయోజన విద్యాధికారి రాజేంద్రప్రసాద్, ఏపీఎం వెంకట రామారావు

**కామేపల్లి, ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి :**

చదువుకోవడం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం మరింతగా పెంపొందు తుందని జిల్లా వయోజన విద్యాధికారి రాజేంద్రప్రసాద్, సెర్ప్ ఏపీఎం వెంకట రామారావు అన్నారు.కామేపల్లి లో గురువారం నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. స్వయం సహాయక సంఘా లను మరింత బలోపేతం చేయాలని కోరారు.మహిళ లు చదువుకోవడం అంటే కేవలం అక్షరాలు నేర్చుకోవ డం మాత్రమే కాదని చదువు ద్వారా ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక సామర్థ్యం,హక్కులపై అవగాహన,సమాజంలో గౌరవం పెరుగుతాయని
అన్నారు.ఒక మహిళ అక్షరాస్యురాలైతే ఆమె కుటుంబంలోని పిల్లల విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆర్థిక నిర్వహణ వంటి అనేక అంశాలపై సానుకూల ప్రభావం చూపగలదని తెలిపారు.ఉల్లాస్ కార్యక్ర మం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానంతో పాటు ఆర్థిక,డిజిటల్ అక్షరాస్యత అందించాలని సూచించా రు.మహిళా సంఘాల సభ్యులు ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.



ప్రతి మహిళ ఓపెన్ టెన్త్, ఇంటర్ ద్వారా అడ్మిషన్ స్కూల్ టాస్ ద్వారా తెలియజేయడం జరిగింది. అక్షరాస్యురాలిగా మారినప్పుడే కుటుంబం, గ్రామం,సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా అధికారులు,మహిళా సంఘాల ప్రతినిధులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించా రు."చదువుకున్న మహిళ -- ఆర్థికంగా అవగాహన కలిగిన మహిళ --సాధికార మైన కుటుంబం" అనే లక్ష్యంతో ఉల్లాస్ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీసీలు సుభద్ర,పుష్ప కుమారి, సరోజిని,చైతన్య,నాగమణి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు

**గోదావరిఖని :** స్థానిక ఫోటో భవన్ లో 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ వేడుకలలో ముందు కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల సమర్పించి తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జెండా ఆవిష్కరణ ఇద్దరు సీనియర్ ఫోటోగ్రాఫర్లు కొండ శ్రీశైలం, గడ్డం బ్రహ్మచారి దంపతులకు శాలువాతో,సన్మాన పత్రంతో, పట్టుబట్టలతో ఘనంగా సన్మానించడం జరిగింది.అనంతరం ప్రపంచ ఫోటోగ్రఫీ డే కేకు ను కట్ చేసి చేసి మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారులు శనగరపు మల్లేష్ ,దుస్సా మహేష్, రామగిరి శ్రీనివాస్ కన్వీనర్ ఎలగందుల శ్రీనివాస్, బండారి ప్రసాద్, ఎర్ర పవన్ కళ్యాణ్ లతో పాటు సీనియర్ ఫోటోగ్రాఫర్లు మరియు అసోసియేషన్ సభ్యులు హాజరు కావడం జరిగింది.

## కామేపల్లి లో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు



**కామేపల్లి, ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి :**

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రమైన కామేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షులు రెడబోతు గోపిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్యనారాయణ, నెమలిపురి సర్పంచ్ భూక్య బలరాం నాయక్, కామేపల్లి ఉపసర్పంచ్ అజ్మీర నాగమణి, మాజీ సర్పంచులు అజ్మీర రామదాస్ నాయక్, అజ్మీర అర్జున్ నాయక్, మాలోతు రామచందర్, మాజీ ఉపసర్పంచ్ రాయల లక్ష్మయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రాజీవ్ గాంధీ దేశానికి, ప్రజలకు, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఘనంగా నిర్వహించిన ఈ జయంతి వేడుకల్లో మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య,

**కాంగ్రెస్ నాయకులు**

నల్లమోతు వెంకట నరసయ్య, భూక్య శ్రీరాములు, ఏనూటి శ్రీనివాస్, భూక్య సీతారాములు, గండు సాగర్, బండి నరసింహారావు, అజ్మీర శివ, అజ్మీర కృష్ణ, దుండిగల శబరినాథ్, పేరసాని ప్రసాద్,
దేవేండ్ల నాగేశ్వరరావు, కొర్ర రాములు, అజ్మీర సుశీల దేవి, యన్నమాల సుశీల, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలతో భారత్ పోటీపడే విధంగా పునాదు లు వేసిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దే

- మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు



**కామేపల్లి, ఆగస్టు 20 మీ వార్త ప్రతినిధి :**





ప్రపంచ దేశాలతో మన దేశం పోటీపడే విధంగా పునాదులు వేసిన ఘనత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేనని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కార్యదర్శి ఫత్తే మహమ్మద్, జిల్లా నాయకులు తోటకూరి శివయ్య అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కామేపల్లి మండలం అడవి మద్దులపల్లి గ్రామంలో బస్టాండ్ సెంటర్ లో రాజీవ్ గాంధీ విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడారు. నవ భారత నిర్మాత,యువ సాధికారతకు స్ఫూర్తి ప్రదాత,శాంతి,సామరస్య సద్భావనల ప్రతీక రాజీవ్ గాంధీ అన్నారు.భారత దేశానికి ఆధునికత, అభివృద్ధి,సాంకేతిక,విజ్ఞానానికి దిశా నిర్దేశం చేసిన దూర దృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు.సాంకేతిక విప్లవం ద్వారా దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన మాజీ ప్రధానమంత్రి "భారతరత్న "రాజీవ్ గాంధీ అని అన్నారు.ఆనాడు ఐటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని బెంగళూరు,కర్ణాటక మైసూరులో మహానగరాలలో ఓపెన్ చేసి ఎంతో మంది నిరుద్యోగ యువత ఇతర దేశాలకు వెళ్లకుండా భారతదేశంలోనే ఐటీ రంగాన్ని స్థాపించి ఉపాధి అవకాశాలను కల్పించిన నాయకుడు మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీ అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కాట్రాల వీరబాబు,సంగారెడ్డి,జి.నారాయణ రెడ్డి, ఇమ్మడి రామనాథం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి.గబ్రు నాయక్,ఎడ్లపల్లి శేషగిరి రావు,మాజీ జడ్పీటీసీ ఎం.సరి రామ్ నాయక్, మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం,మాజీ ఎంపీటీసీ కొండ మల్లయ్య,మాజీ సర్పంచులు,ప్రస్తుత సర్పంచులు,కాంగ్రెస్ కార్యకర్తలు,అభిమానులు, గ్రామ పెద్దలు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి ఎంపిక ప్రక్రియ

**గోదావరిఖని :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో ఈ రోజు మొదటి సంవత్సరానికి గాను ఎన్సిసి (ఔఅఅ )ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 23 ఖాళీలకు గాను 45 మంది విద్యార్థులు పోటీ పడగ 11 మంది అమ్మాయిలు మరియు 12 మంది అబ్బాయిలు ఎంపిక అయ్యారు. ఎంపిక ప్రక్రియను కళాశాల ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ భూక్యా తిరుపతి మరియు 9 తెలంగాణ బెటాలియన్ సుబేదార్ రమేష్ థాపా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా మాట్లాడుతూ ఎన్సిసి లో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్సిసి వల్ల క్రమశిక్షణ మరియు సమయపాలన అలవడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయి చేరుకోవడానికి ఎన్సిసి తోడ్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.



# మహిళలకు స్ఫూర్తినిస్తుంది

'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రానా 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా రిలీజైన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుతారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది

# మోడ్రన్ మిస్సమ్మ కథ



హర్ష నర్రా, తన్మయి, ఖుషి, సిజు ఏఆర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. సాయిబాబా దర్శకుడు. లాస్య అండ్ మిథున క్రియేషన్స్ తెరకెక్కిస్తున్నాయి. బుధవారం ఈ సినిమాలోని 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అనే తొలిపాటను విడుదల చేశారు. గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. 'కథపై నమ్మకంతో ఈ సినిమాకు 'మోడ్రన్ మిస్సమ్మ' అనే టైటిల్ పెట్టాం. పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేశాం' అని దర్శకుడు తెలిపారు. నేటి ట్రెండ్‌కు తగిన సినిమా ఇదని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు.కొ




# అక్కినేని త్రయం అదరగొట్టే లుక్స్..

## 'వెరైటీ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై నాగ్, చైతూ, అఖిల్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం (అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్) తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. అతి త్వరలో రాబోయే ఈ ప్రత్యేక సంచిక కోసం అక్కినేని హీరోలు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో వారు సినిమా రంగంలో తమ కుటుంబం సాధించిన అరుదైన విజయాలు, తొమ్మిది దశాబ్దాల సినీ ప్రయాణం, నాటి అనుభవాలు మరియు నేటి తరానికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. అత్యంత ఆకర్షణీయమైన దుస్తుల్లో, స్టైలిష్ అప్పియరెన్స్‌తో ఉన్న ఈ అక్కినేని హీరోల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ మూవీకి క్రేజీ టైటిల్.. 'జనవరి 12 విడుదల'

అనిల్ రావిపూడి ప్రమోషన్స్ అంటే మామూలుగా ఉండవు..తన సినిమాల ప్రచారంలోనూ కొత్తదనం చూపించే ఆయన.. తాజాగా మరోసారి తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమాకు టైటిల్ ప్రకటించే విషయంలోనూ ఓ ఫన్నీ ఐడియాను తీసుకొచ్చారు. టైటిల్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా ఒకేసారి రివీల్ చేసి ఆసక్తి పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ బావా బామ్మర్ది పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించింది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాదు.. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాప్షన్‌ను కూడా జత చేసింది. టైటిల్ వినగానే ఇది సినిమా విడుదల తేదీ అనుకుంటే.. అదే సినిమా పేరుగా ఉండటం విశేషం. టైటిల్ ప్రకటన కోసం రూపొందించిన వీడియోలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి.. అనిల్ రావిపూడిని సినిమా పేరేంటని అడుగుతారు. అందుకు ఆయన పదే పదే 'జనవరి 12 విడుదల' అని చెబుతుంటారు. తొలుత అది రిలీజ్ డేట్ అని భావించిన హీరోలు.. చివర్లో అదే సినిమా టైటిల్ అని తెలుసుకుని సరదాగా స్పందిస్తారు. టైటిల్ రివీల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ప్రత్యేకంగా నివాళి అర్పించారు. ఈవీవీ తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా వీడియోను రూపొందించారు. ఇలా తన కామెడీ మార్క్‌తో పాటు పాత తరం హాస్యాన్ని కలిపి టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను కూడా ఓ ఎంటర్‌టైనింగ్ వీడియోగా మార్చారు.

